## క్లుప్తంగా

### ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మణుగూరుటౌన్: 2024–25లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిసెట్ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఓటూ జీఎం శ్యాంసుందర్ అన్నారు. గురువారం పీవీకాలనీ సింగరేణి స్కూల్‌లో డీజీఎం (పర్సనల్) రమేశ్‌తో కలిసి రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీఎండీ బలరాంనాయక్ సూచనల మేరకు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీఎస్ పాలిసెట్–2025 ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వేణు, ఉపాధ్యాయులు కృష్ణబాబు, లలిత, మమత, విద్యార్థులు పాల్గొన్నారు.

### 'కోతులు పట్టేందుకు రెడీ'

చంద్రుగొండ: ప్రభుత్వ పరంగా చేయూతనందిస్తే.. కోతులను పట్టి వాటిని అటవీప్రాంతానికి తరలించే బాధ్యతను తీసుకుంటానని చంద్రుగొండకు చెందిన యువకుడు ఎస్డీ సద్దాం ముందుకు వచ్చాడు. చంద్రుగొండల మండలంలో కోతులు పేట్రేగిపోతున్న తీరుపై 'గ్రామాల్లో కోతుల బెడద' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురించిన విషయం విదితమే. ఈ మేరకు స్పందించిన సద్దాం.. ఇప్పటికే కోతులను బంధించే ఐరన్ బోన్‌లు తయారు చేసినట్లు, అందుకోసం తన సొంతంగా రూ.50 వేలు వెచ్చించినట్లు తెలిపారు. అయితే కోతులు పట్టేందుకు పల్లిగింజలు అవసరం ఉంటుందని, కోతులను అటవీప్రాంతానికి తరలించేందుకు నలుగురు యువకులు, రవాణాకు ఆర్థిక సహకారం కావాలని వెల్లడించాడు. ఈ మేరకు అధికారులు, స్థానికులు చేయూతనివ్వాలని కోరుతున్నాడు.

### ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

బూర్గంపాడు: అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబి.నర్సారెడ్డి డిమాండ్ చేశారు. బూర్గంపాడు మార్కెట్‌యార్డులో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని ఆందోళన చేపట్టారు. మార్కెట్‌యార్డుకు అమ్మకానికి తీసుకువచ్చిన ధాన్యాన్ని తేమశాతం ఉందని కొనుగోలు చేయకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, బయ్యా రాము, ఎస్‌కె.అబీదా, రాయల వెంకటేశ్వర్లు, ప్రతాప్ పాల్గొన్నారు.

### వచ్చే నెలలో కాపు సింహగర్జన సభ

అశ్వాపురం: మే నెలలో జరిగే కాపుల సింహగర్జన సభను విజయవంతం చేయాలని కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి వల్లాల ప్రసాదరావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు కమటం వెంకటేశ్వరరావు నివాసంలో గురువారం జరిగిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం నియోజకవర్గ కో ఆర్డినేటర్ వలసాల వెంకటరామారావు, జిల్లా కన్వీనర్ ఆది కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు లంకా నరసింహారావు, బెల్లంకొండ రామారావు, వారాల వేణు, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మే నెలలో హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మున్నూరుకాపు సింహగర్జన సభను జయప్రదం చేయాలని మున్నూరుకాపు సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు వల్లాల ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక మణుగూరు మండల మున్నూరుకాపు సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మన్నూరుకాపు సంఘం పినపాక నియోజకవర్గ కో ఆర్డినేటర్ వలసాల వెంకటరామారావు, మండల అధ్యక్షుడు వన్నం కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శి గాండ్ల సురేష్, నాయకులు ఎడవల్లి వెంకటయ్య, కుర్రి నాగేశ్వరరావు, గాజుల రమేష్, పులిశెట్టి బాబు, మిరాయాల భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఏరియర్స్ ఇప్పించాలని ఎమ్మెల్యేకు వినతి

మణుగూరుటౌన్: మూడు సంవత్సరాలుగా రావాల్సిన ఏరియర్స్‌ను వెంటనే ఇప్పించాలని కోరుతూ.. నాలుగు రోజులుగా మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో గురువారం కార్యాలయం నుంచి ప్రజాభవన్ వరకు ర్యాలీగా డప్పువాయిస్తూ వెళ్లి.. ఎమ్మెల్యేకు సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు మాట్లాడుతూ.. ఒక్కొక్క కార్మికుడికి రూ.1.80లక్షలు రావాల్సి ఉందని, కమిషనర్లు మారుతున్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కొడిశాల రాములు, కార్మికుల అధ్యక్షులు పల్లపు నాగేశ్వరరావు, సీహెచ్ నర్సింహారావు, దుర్గయ్య, రమాదేవి, పుల్లయ్య, ఎల్లమ్మ, లక్ష్మీనారాయణ, వేణు, హరీష్, చంద్రయ్య, సాయమ్మ, నర్సమ్మ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్ఎన్ఎల్.. నో సిగ్నల్

- ఏజెన్సీ గ్రామాలకు అందని సేవలు
- సిగ్నల్స్ కోసం ఊరుబయటకు ఉరుకులు
- ఇతర నెట్‌వర్క్ సేవలూ అంతంత మాత్రమే...
- అత్యవసర సమయాల్లో గిరిజనుల పాట్లు



దామరతోగులో కర్రకు మొబైల్ కట్టి గుట్టపై నుంచి 108కు సమాచారం అందిస్తున్న యువకుడు (ఫైల్)



చెట్టుపల్లిలో నిరుపయోగంగా ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్

గుండాల: పురుటి నొప్పులు వచ్చినా.. పాము కరచినా.. ఏ అత్యవసర పరిస్థితి వచ్చినా.. గిరిజన గ్రామాల వాసులు 108 సేవలను పొందలేకపోతున్నారు. ఫోన్ చేయడానికి సిగ్నల్ వ్యవస్థ లేకపోవడమే ఇందుకు కారణం. అత్యవసర పరిస్థితి వస్తే.. గిరిజనులు ఫోన్ సిగ్నల్స్ కోసం ఊరి బయటకు ఉరుకులు, పరుగులు పెడతారు. గ్రామ సమీపంలోని గుట్టలపైకి, వాటర్ ట్యాంక్‌లు ఎక్కి ఫోన్ చేస్తుంటారు. ఇక దిక్కుతోచని స్థితిలో ట్రాక్టర్, ద్విచక్ర వాహనంపై ఆస్పత్రికి తరలించి వైద్యం పొందుతారు.

**పనిచేయని టవర్లు**

మండలంలో అన్ని గ్రామాలకు సిగ్నల్ అందేలా బీఎస్ఎన్ఎల్ టవర్లు నిర్మించారు. కానీ ఏ రోజూ సరిగ్గా సిగ్నల్ అందింది లేదు. మండల కేంద్రంతో పాటు దామరతోగు, వెంకటాపురం, సాయనపల్లి, ముత్తాపురం, మామకన్ను, కాచనపల్లి, చెట్టుపల్లి, శంభునిగూడెం గ్రామాల్లో సెల్ టవర్లు ఏర్పాటు చేశారు. దామరతోగులో ఏడాదిన్నర కిత్రం పిడుగు పడి సిగ్నల్ ఆగిపోయింది. పలు మార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. చెట్టుపల్లి, శంభునిగూడెం ప్రాంతాలలో రెండేళ్లుగా సిగ్నల్ రావడం లేదు. ఆయా ప్రాంతాల్లో ఇతర నెట్‌వర్కులూ లేవు. దీంతో ఊరిబయటకు వెళ్లి సమాచారం చేరవేయాల్సి వస్తుంది. మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాల్లో సిగ్నల్ ఎప్పుడు వస్తుందో..ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి.

**ఆస్పత్రికైనా.. ఆన్‌లైన్ అయినా..**

అత్యవసర సమయాల్లో 108కు సమాచారం అందించేందుకు ఆయా ప్రాంతాల గిరిజనులు పడరాని పాట్లు పడుతున్నారు. ఆటో, ట్రాక్టర్‌లపై బాధితులను ఆస్పత్రికి తీసుకవెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంక్షేమ పథకాలపై అధికారులు సమాచారం ఇవ్వాలన్నా కుదరదు. ఆ గ్రామాలకు వెళ్లాల్సిందే. కానీ అధికారులు అంత శ్రద్ధ తీసుకోరని వాపోతున్నారు. ఇక విద్యార్థులు సైతం ఏదైనా ఆన్‌లైన్ చేసుకోవాలన్నా నెట్ సౌకర్యం లేక మండల కేంద్రానికి వస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీఎస్ఎన్ఎల్ సేవలను పునరుద్ధరించాలని వేడుకుంటున్నారు.

**అత్యవసరంలో ఇబ్బందులు**



మా ఊళ్లో గర్భిణులు పురిటి నొప్పులు వస్తే ఎలా తీసుకెళ్లాలో తెలియదు. మార్గం మధ్యలో ట్రాక్టర్లలో కాన్పులు అయిన సంఘటనలు ఉన్నాయి. పురుగుమందు తాగినా, ప్రమాదం జరిగినా ఇబ్బందులు తప్పడం లేదు.

– ఈసం అనసూయ

**ప్రాణంపై ఆశలు ఉండవు..**



సిగ్నల్ లేక 108కి సమాచారం ఇవ్వలేకపోతే పేషంట్లను ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే 30 కి.మీలు ఆటోనో, ట్రాక్టర్‌లో తీసుకెళ్లాలి. ఆ క్రమంలో ప్రాణంపై మాకు ఆశలు ఉండవు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– జనగం వెంకటేష్

# మండలంలో తాగునీటి ఎద్దడి



చేతిపంపు నుంచి నీళ్లు తీసుకెళ్తున్న జనం

చంద్రుగొండ/అన్నపురెడ్డిపల్లి: రెండు మండలాల్లో రెండు రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో అశ్వాపురం మండలం రథం గుట్ట సమీపంలోని గోదావరి వద్ద నెలకొన్న సాంకేతిక లోపాలను సరిచేసే క్రమంలో రెండు రోజులుగా చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో గ్రామాల్లోని భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంకులన్నీ ఖాళీ అయ్యాయి. ఫలితంగా నీటి సరఫరా నిలిచిపోయింది. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయకపోవడంతో జనం తాగునీటికి విలవిల్లాడుతున్నారు. వేసవి దృష్ట్యా అధికారులు సత్వర చర్యలు తీసుకుని నీటి సరఫరా పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

# పాఠశాలలను బలోపేతం చేయాలి



ప్రధానోపాధ్యాయులకు విద్యార్థుల యూనిఫామ్ అందిస్తున్న ఎంపీడీఓ సునీల్ కుమార్

పినపాక: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని, విద్యార్థుల నమోదు శాతం పెంచాలని ఎంపీడీఓ సునీల్ కుమార్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ మేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రానున్న విద్యాసంవత్సరంలో విద్యార్థులకు అందించే దుస్తులను పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయులకు అందించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పాఠశాలల పనితీరు తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచాలన్నారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచి, ఆవరణలో మొక్కలు, ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగయ్య, ప్రధానోపాధ్యాయులు రామ్ గోపాల్, రమణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### పూడికతీత పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: మండలంలోని చిన్న ఆర్లగూడెం గ్రామంలోని కొంగవాగులో చేపట్టిన పూడికతీత పనులను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ.. చెరువు లోతు ఎక్కువగా తీయడం వల్ల నీళ్లు ఎక్కువగా నిల్వ ఉంటాయని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. చెలువుకు అలుగు వంటి చర్యలను సరైన రీతిగా ఏర్పాటు చేయాలని, తద్వారా రైతుల పంటకు నీరు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

### భద్రత కట్టుదిట్టం చేయాలి

పినపాక: రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని డీఎస్పీ వంగా రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలో పర్యటించిన ఆయన.. పొంగులేటి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. పర్యటనలో ఎటువంటి లోపాలు జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అద్దంకి నరేష్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రాజ్ కుమార్, ఎంపీడీఓ సునీల్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

### హోమియోపతి దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న హోమియోపతి డాక్టర్ రాజేష్

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల హోమియోపతి వైద్యశాలలో హోమియోపతి పితామహుడు డాక్టర్ శామ్యూల్ హానీమాన్ జన్మదినోత్సవం సందర్భంగా ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శామ్యూల్ హానీమూన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హోమియోపతి వైద్యుడు రాజేష్ బాబు మాట్లాడుతూ.. హోమియోపతితో అన్ని రకాల వ్యాధులకు పరిష్కారం ఉందన్నారు. పర్ణశాల డాక్టర్ రేణుక రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### అనాథాశ్రమానికి వితరణ

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర మాజీ ట్రైకార్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు అశ్వారావుపేటలోని అమ్మ సేవా సదనానికి గురువారం ఆర్థిక సాయం అందించారు. మాజీ ఎమ్మెల్యే కుమార్తె తాటి మహాలక్ష్మి వర్ధంతి సందర్భంగా స్థానిక అనాథాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేసి, అనంతరం ఆశ్రమ నిర్వాహకురాలు కూరపాటి అనసూయకు రూ.10వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తనయుడు తాటి రవికుమార్, మాజీ సర్పంచ్ పొట్టా రాజులు, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

### భక్తులకు అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ సాయినగర్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో సాయిబాబాకు గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కొత్తగూడెం ప్రాంతానికి చెందిన పల్నాటి శ్రీనివాసరావు–సుజాత దంపతులు, రాజేష్–ప్రత్యూష దంపతులు, నవేశి, సుప్రజలు సాయినాథుడిని దర్శించుకుని భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం అన్నదాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం.. నిరుపేదలకు వరం



లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అశ్వాపురం: సన్న బియ్యం పథకం నిరుపేదలకు వరమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని మిట్టగూడెం రేషన్ షాపులో గురువారం లబ్ధిదారులకు ఆయన సన్న బియ్యం పంపిణీ చేశారు. 19 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో సమానంగా నిరుపేదలు సన్నబియ్యంతో పౌష్టికాహారం తినాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. పినపాక నియోజకవర్గ అభివృద్ధిపై అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ వరప్రసాద్, ఎంఈఓ వీరస్వామి, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొదాలి వెంకటేశ్వరరావు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, గాదె కేశవరెడ్డి, రమేష్, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# స్వామివారికి ఊంజల్ సేవ



స్వామి వారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామివారికి ప్రత్యేక ఉయ్యాలలో ఘనంగా ఊంజల్ సేవను నిర్వహించారు. భద్రాచలం ఆలయ స్థానాచార్యులు శ్రీమాన్ కేఈ.స్థలశాయి స్వామివారు స్వామివారి జోల లాల పాటలు ఆలపించి ఉంజల్ సేవను వైభవంగా నిర్వహించారు. అనంతరం తిరువీధి సేవను చేపట్టారు. అదేవిధంగా నిత్య హోమం, నిత్య పూర్ణాహుతి, బలిహరణ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగాయి. స్వామివారికి నివేదనగా ప్రత్యేక ప్రసాదాన్ని ఆరగింపు చేసి భక్తులకు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, ముఖ్య అర్చకులు కారంపూడి కిరణకుమారాచార్యులు, భార్గవాచార్యులు, వెంకటాచార్యులు భరద్వాజ చార్యులు, రాజగోపాలాచార్యులు, నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ జయలక్ష్మి

మణుగూరురూరల్: పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని మణుగూరు ఐసీడీఎస్ సీడీపీఓ జయలక్ష్మి తెలిపారు. సమితిసింగారం సెక్టార్ పరిధిలోని సమితిసింగారం–1, రిక్షాకాలనీ సమితిసింగారం –3, సాయినగర్, గుండుసింగారం ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీడీపీఓ గర్భిణులు, బాలింతలు, రెండేళ్ల లోపు చిన్నారులు అందించాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ హైమావతి, పోషణ అభియాన్ అధికారి నాగేశ్వరరావు, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు ఎం.కృష్ణవేణి, జి.సుజాత, ఎం.అరుణ, ఎస్.సీతామహలక్ష్మి, ఈ యశోద తదితరులు పాల్గొన్నారు.

# క్రీడామైదానం నిర్వహణ శూన్యం




శేషగిరినగర్ శివారులో క్రీడామైదానం వద్ద చెత్తాచెదారం

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలో చెత్త సేకరణలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. మున్సిపాలిటీలోని శేషగిరినగర్ శివారు క్రీడామైదానం వద్ద ఉన్న చెత్త కుప్పలే ఇందుకు నిదర్శనం. చెత్త సేకరణ తూతూ మంత్రంగా జరుగుతుండటంతో క్రీడామైదానం పరిసరాలు చెత్తకు ఆవాసాలుగా మారాయి. అక్కడి చెత్తను సైతం నెలల తరబడి అలానే ఉంచారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కొన్ని నెలలుగా చెత్తను తీయకపోవడంతో అటుగా వెళ్లే వారంతా ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి చెత్త తొలిగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదానికి కారణమైన ఓ ట్రాక్టర్ డ్రైవర్‌పై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. ఈ నెల 3న భద్రాచలంలోని రామాలయానికి ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలానికి చెందిన భక్తులు వెళ్తున్న క్రమంలో అశ్వారావుపేట మండలం నందిపాడు–ఆసుపాక గ్రామాల మధ్యలో ట్రాక్టర్ అదుపుతప్పి తోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు భక్తులకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ కొండపల్లి శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### రోడ్డు ఆక్రమణపై నోటీస్

గుండాల: ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఓ వ్యక్తి రోడ్డు ఆక్రమించిన విషయంలో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో వ్యక్తి రోడ్డును ఆక్రమించాడని స్థానికులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణపై పలుమార్లు వివిధ పార్టీల ఆధ్వర్యంలో చర్చలు జరుపుతూ వాయిదాలు వేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆ వ్యక్తికి నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో రోడ్డుపై మట్టిని తొలగించి, ఆక్రమణలో ఉన్న రోడ్డును వదిలివేయాలని, లేదంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అశ్వాపురం: మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చవిటిగూడెం గ్రామానికి పెరుగు ప్రసాద్ బైక్ వస్తుండగా ట్రాలీ ఆటో ఢీకొట్టడంతో ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన అశ్వాపురం పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేక ప్రథమ చికిత్స కూడా చేయకపోవడంతో స్థానికులు ప్రైవేటు వాహనంలో భద్రాచలం తరలించారు. జిల్లా కలెక్టర్, అధికారులు స్పందించి రాత్రి సమయంలో ఓ వైద్యుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### ప్రారంభమైన జాతర

బూర్గంపాడు: సారపాక ముత్యాలమ్మపేటలో ముత్యాలమ్మతల్లి జాతర గురువారం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారి ఆలయంలో మంగళ తోరణ అలంకరణ, గణపతి పూజ, పంచామృత అభిషేకాలు,అఖండ దీపస్థాపన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపాలైన గరిగలను మేళతాళాలతో ఊరేగింపుగా గోదావరికి తీసుకెళ్లి పుణ్యస్నానాలు చేయించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

### బకాయిలు చెల్లించాలి

ములకలపల్లి: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఒడ్డురామవరం, పూసుగూడెం గ్రామాల శివారులోని పని ప్రదేశాలను గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. కూలీలతో మాట్లాడారు. నాయకులు రావూజా, వెంకటేశ్వర్లు, అమల, జగ్గు, భోజ్య, విజయ, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ ధరలపై ఆందోళన

వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధర పెంపును నిరసిస్తూ.. గురువారం పలుచోట్ల నిరసనలు భగ్గుమన్నాయి. సీపీఎం, సీపీఐ, ఎన్డీ, ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో రహదారులపై ఆందోళన చేపట్టారు. కొన్నిచోట్ల ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ప్రభుత్వ కార్యాలయల వద్ద ధర్నా చేపట్టి, అక్కడి అధికారులకు వినతిపత్రాలు అందించారు. నాయకులు మాట్లాడుతూ.. ప్రజల నడ్డి విరిచేలా ఇంధన, నిత్యావసరాల ధరలు పెంచుతూ వస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును విమర్శించారు.

– సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంఅర్బన్: అంబేడ్కర్ సెంటర్‌లో కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన..



ములకలపల్లి: ఖాళీ గ్యాస్‌బండతో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు



దమ్మపేట: లింగాలపల్లిలో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాస్‌లైన్ నాయకులు



చర్ల: వంటగ్యాస్ ధరల పెంపుపై ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు



గుండాల: మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న ఎన్డీ నాయకులు